అతడు, నేసిన చీరలకి అంచులు కత్తిరించేవాడు. ఒకోసారి చీరలకి ప్రింటింగు కూడా చేయవలసి వచ్చేది. నేతమీద అతడి వేళ్ళు అపురూపంగా జారేవి. నూలుని ముట్టుకోకుండానే కౌంట్ చెప్పగలిగేవాడు. నారాయణపేటలో వృద్ధులు కూడా ఆ కుర్రవాడి పనితనానికి అబ్బురపడే వారు. పదో తరగతి తెలుగు మాస్టారంటే అతడికి చాలా అభిమానం-క్లాసులో ఒకసారి ఆయన రాజస్థాన్ గురించి చెప్పాడు.

"రాజస్థాన్‌లో 'మల్వోరీ' అనే ప్రాంతం పెళ్ళి చీరలకు ప్రసిద్ధి! అక్కడ ఒక్కొక్క చీరనీ ఒక్కరే పూర్తిగా నేస్తారుట. ఒక పెళ్ళి చీరెను పూర్తిగా నేసిన ఆ చీరె ఏ పెళ్ళికూతురి వంటివి అలరిస్తుందో ఊహించుకుంటూ. తన పెళ్ళి గురించి కలలుకంటూ, ఒక్కో కన్నెపిల్లా కూనిరాగాలు తీస్తూ చీరను పూర్తిచేస్తుంది. ఆ పాటలని 'లోరీ' లంటారు. పూర్తిగా ఒక కన్నెపిల్ల చేతిమీద తయారయిన ఆ రాజస్థాన్ చీరెలు దేశంలో ఎంతో ప్రసిద్ధి ..... "

పదో తరగతి ప్రథమ శ్రేణిలో పాసయినప్పుడు- తను స్వయంగా నేసిన చీరనే మాస్టారింటికి తీసుకువెళ్ళి ఇచ్చాడు. మబ్బురంగు మీద మల్లె అంచు ఎవరి హృదయాన్నైనా యిట్టే ఆకట్టుకుంటుంది. దాన్ని చూసి మాస్టారుగారి భార్య ఎంతో మురిసిపోయింది. "ఇప్పుడెందుకురా ఇవన్నీ-" అన్నారు మాస్టారు మందలిస్తున్నట్టు. నేనూ నా భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ 'ఈ చీరె నేశాను మాస్టారు' పైకి అనలేదు. అతడు-మనసులో అనుకున్నాడు.

"చాలా బావుందిరా" అంది ఆయన భార్య చీరెని చేతుల్లోకి తీసుకుంటూ. కుర్రవాడు నవ్వి తలదించుకున్నాడు. మళ్ళీ ఆవిడే అంది- "ఒరేయ్- నీ పనితనం చూస్తుంటే ఎప్పటికయినా నువ్వు గొప్ప వాడివి అవుతావని అనిపిస్తుందిరా."

వింటూన్న మాస్టారు ఆ కుర్రవాడివైపు సానుభూతితో చూశాడు. కాపిటలిస్టుల కబంధహస్తాలు నారాయణపేట కార్మికుల హస్త నైపుణ్యాన్ని కబళించినంత కాలమూ గొప్పవాడు అయ్యే ప్రసక్తి లేదని అతడికి తెలుసు.

"పదో క్లాసు పాసవటానికి మాస్టారు కారణమమ్మా. ఇంతకన్నా పెద్దది ఇచ్చుకోలేను."

"అంత మాటనకురా. నువ్వింకా చదవాలి ఎంత కష్టపడయినాసరే! శలవుల్లో ఇక్కడికే రా. రోజూ ఓ గంట చదువు చెబుతాను"

"శలవుల్లో పట్నం వెళ్దామనుకుంటున్నాము మాస్టారూ. ఈ పల్లెల్లో ఎంత అమ్మినా ఏముంది! నాలుగు చీరలు పట్నంలో అమ్మగలిగితే చాలు"

"పట్నంలో ఈ చీరలు ఎవరు కొంటార్రా?"

"దిగితేగానీ లోతు తెలీదుగా మాస్టారూ."